క్లుప్తంగా

బ్యాడ్మింటన్ క్రీడల్లో సత్తా చాటాలి


క్రీడా దుస్తులతో క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రస్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడల్లో బాల, బాలికలు సత్తా చాటాలని జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ షేక్షావలిరెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని శ్రీగురురాజ పాఠశాల క్రీడా మైదానంలో బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులకు ప్రెస్టేజ్ షోరూం అధినేత శివకుమార్ క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ షేక్షావలిరెడ్డి ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు అనంతపురం జిల్లా ధర్మవరం మండలంలోని రామాపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఆర్గనైజేషన్ సెక్రటరీ సురేష్, శిక్షకుడు రాజు, శివారెడ్డి పాల్గొన్నారు.

ప్రతి రైతుకు యూరియా అందిస్తాం

శిరివెళ్ల: రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రతి రైతుకు యూరియా అందిస్తామని తహసీల్దార్ జయశ్రీ, ఏఓ సుధాకర్ అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ గోవిందపల్లెకు 47 టన్నులు, జీనేపల్లెకు 25 టన్నులు, యర్రగుంట్లకు 36 టన్నులు, కోటపాడుకు 47, శిరివెళ్లకు 47 టన్నుల యూరియా కేటాయించామన్నారు. ముందే రైతులకు టోకన్లు ఇచ్చి, ఎలాంటి అవకతవకలు లేకుండా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఉయ్యాలవాడ: ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మాయలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి రాబర్ట్ కెనడి సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ వర్షాలకు తడిస్తే జలుబు, దగ్గు, జ్వరాలు సోకే ప్రమాదం ఉందన్నారు. గృహ ఆవరణలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రాత్రి పూట దోమతెరలు వినియోగించాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): పబ్లిక్ టాయిలెట్ (స్కావెంజర్) కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం చేస్తామని ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా మాజీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మురళీధర్, పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ స్కావెంజర్లకు కనీస వేతనం రూ.16వేలు ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులుగా గుర్తించాలని, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈశ్వరమ్మ, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు సుశీలమ్మ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని పద్మావతినగర్‌లో గెలివి ఆసుపత్రి నుంచి పద్మావతి నగర్ వరకూ మున్సిపల్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ప్రారంభించారు. గురువారం పద్మావతినగర్‌లో రూ.1.40 కోట్ల మున్సిపల్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆధ్వర్యంలో మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ నంద్యాల జనాభా పెరిగిపోతున్న నేపథ్యంలో త్రాగునీటికి అవసరాలకు ఇబ్బందులు తలెత్తకుండా సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణ ప్రతిపాదనను ముఖ్యమంత్రికి అందజేశామని చెప్పారు.

కూలిన మట్టి మిద్దె


మట్టి మిద్దెపై కూలిన చెట్టు

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో గురువారం తెల్లవారుజామున చెట్టు విరిగి పడటంతో చాకలి గంగన్నకు చెందిన మట్టి మిద్దె కూలిపోయింది. గంగన్న కుటుంబీకులు ఆరుబయట నిద్రించడంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. వీఆర్ఓ దేవశిఖామణి గ్రామానికి చేరుకుని పరిశీలించారు. నివేదికను తహసీల్దార్‌కు అందజేస్తానని తెలిపారు.

దత్తాత్రేయుడికి విశేష పూజలు

శ్రీశైలం టెంపుల్: లోకకల్యాణం కోసం దేవస్థానం గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం కింద నెలకొని ఉన్న దత్తాత్రేయ స్వామివారికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. ముందుగా మహాగణపతిపూజను జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామి వారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై కర్నూలుకు చెందిన మాతా సత్సంగ్ వారి శివానంద లహరి, సౌందర్యలహరి పారాయణ కార్యక్రమం పలువురు భక్తులను అలరించింది. రెండవ కార్యక్రమంలో భాగంగా నంద్యాల జిల్లా బొల్లవరానికి చెందిన ఎస్.రామన్నగౌడ్, బృందం భజన కార్యక్రమం ఆకట్టుకుంది.


ఉయ్యాలవాడలో కురుస్తున్న వర్షం


ఉయ్యాలవాడ ఉన్నత పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు


4వ అంగన్‌వాడీ కేంద్రం ఎదుట నిలిచిన వర్షపు నీరు


సర్వాయిపల్లె గ్రామ సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వంక

ముంచెత్తిన వర్షం

- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- నీట మునిగిన పంట పొలాలు

ఉయ్యాలవాడ: మండలంలో భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో మిరప, పత్తి, మినుము, మొక్కజొన్న తదితర పంటలు నీట మునగాయి. విత్తనాలు, రసాయనిక ఎరువులకు ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పెట్టిన పెట్టుబడులు వర్షార్పణమయ్యాయి. కోవెలకుంట్ల, జమ్మలమడుగు ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిలో అల్లూరు, గుళ్లదుర్తి గ్రామాల మధ్య భారీ వృక్షాలు నేలకూలడంతో ఉదయం రెండు గంటల పాటు రాకపోకలు స్తంభించిపోయాయి. కడప, ప్రొద్దుటూరు, కర్నూలు, కోవెలకుంట్ల పట్టణాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఉయ్యాలవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో, బీసీ కాలనీలోని 4వ అంగన్‌వాడీ కేంద్రం ఎదుట వర్షపు నీరు నిలిచిపోవడంతో విద్యార్థులు, చిన్నారులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సర్వాయిపల్లె గ్రామ సమీపంలోని వంక పొంగి ప్రవహించడంతో గ్రామస్తులు బయటకు వెళ్లేందుకు నానా తంటాలు పడ్డారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి కుందూనదికి భారీగా వరద నీరు విడుదల చేయడంతో హరివరం, ఉయ్యాలవాడ, బోడెమ్మనూరు గ్రామాల మధ్య కుందూనది ఉధృతంగా ప్రవహిస్తోంది


శిరివెళ్ల మెట్ట వద్ద అండర్ పాస్‌వే వద్ద వర్షపు నీరు


హరినగరంవద్ద మొక్క జొన్నలపై పట్టా కప్పిన దృశ్యం

తడిసిన దిగుబడులు

రుద్రవరం: మండలంలో కురిసిన వర్షానికి పలు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు జల మయమయ్యాయి. ముకుందాపురం, చిత్రేనిపల్లె, ఆలమూరు, సర్వాపురం తదితర గ్రామాల పరిధిలో ఆరబోజుకన్న మొక్క జొన్న దిగుబడులు తడిసిపోయాయి. కొందరు రైతులు దిగుబడులను కాపాడుకునేందుకు తంటాలు పడ్డారు. పట్టాలు కప్పిన దిగుబడులు తడిసిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

శిరివెళ్లలో 9.2 మిల్లీమీటర్ల వర్షం

శిరివెళ్ల: మండలంలో గురువారం తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు వర్షం కురిసింది. 9.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. శిరివెళ్ల మెట్ట, గోవిందపల్లె, యర్రగుంట్లలో ఉన్న అండర్ పాస్‌లలోకి నీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షంతో వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడింది.


తడిచిన మొక్కజొన్న ధాన్యాన్ని ట్రాక్టర్‌కు ఎత్తుకుంటున్న రైతులు

తడిసిన ఆశలు

ఆళ్లగడ్డ: వర్షం రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేదికందే సమయంలో ప్రకృతి కోలుకోలేని దెబ్బకొడుతోంది. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి రోడ్లవెంట ఆరబోసిన మొక్కజొన్నలు తడిసి ముద్దయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో ఆరబోసిన మొక్కజొన్నలు వర్షపు నీళ్లలో కొట్టుకుపోయాయి. మరో మూడు నాలుగు రోజులు వర్షాలు ఉన్నాయని చెబుతుండటంతో కల్లాలు, రోడ్లపై ఆరబోసిన మొక్కజొన్నలను కాపాడుకునేందుకు రైతులు నానాపాట్లు పడుతున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

- స్కూల్ హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసులు


కస్తూర్బాలో వంట గదిని పరిశీలిస్తున్న దృశ్యం

గోస్పాడు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇచ్చే ఆహార పదార్థాలు నాణ్యతగా ఉండేలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ దేవి సూచించారు. మండలంలోని జూలేపల్లె, పసురపాడు, గోస్పాడు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక, ఉన్నత, కేజీబీవీ పాఠశాలలను గురువారం తనిఖీ చేశారు. పసురపాడు ఎలిమెంటరీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల ఆధ్వర్యంలో చిరుతిండ్లు విక్రయిస్తున్నట్లు గుర్తి ంచి,వీటి ద్వారా విద్యార్థులు ఇబ్బందులు కలిగితే బా .ధ్యులెవరని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. ఈ విషయంపై హెచ్‌ఎంకు షో కాజ్ నోటీసులు ఇవ్వాలని డిప్యూటీ డీఈఓ శంకర్‌ప్రసాద్‌ను ఆదేశించారు.అనంతరం గోస్పాడు హై స్కూల్‌లో రాగిజావ, బెల్లం ప్యాకెట్లు కాలం చెల్లిన ట్లు గుర్తించారు. దీంతో తహసీల్దార్ షేక్‌మొహిద్దీన్ ఆ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. డీఎం అశ్వర్థనారాయణనాయక్, డీఎస్ఓ రవిబాబు, ఎంఈఓ అబ్దుల్‌కరీం, సీఎస్‌డీటీ ప్రసాదరావు పాల్గొన్నారు.

విద్య, ఆరోగ్యంపై దృష్టి

ఆళ్లగడ్డ: విద్యార్థులకు నాణ్యమైన విద్య, మంచి ఆరోగ్యం అందించేందుకు ప్రత్యేక దృష్టిసారించినట్లు రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు గంజిమాల దేవి తెలిపారు. పట్టణంలోని బాలాసదన్, బాలికల గురుకుల పాఠశాల, కేజీబీవీలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం సరఫరా చేస్తున్న సరుకుల నిల్వలను, రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థుల్లో పౌష్టికాహార లోపం తలెత్తకుండా ప్రభుత్వం బలవర్థకమైన ఆహారాన్ని అందిస్తోందన్నారు. అధికారులు నిర్లక్ష్యం చేయకుండా పిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఆమె వెంట ఎంఈఓలు శోభావివేకవతి, గంగాధర్ ఉన్నారు.

నందమూరి నగర్‌ను అభివృద్ధి చేయండి

నంద్యాల(న్యూటౌన్): పట్టణ శివారు ప్రాంతమైన నందమూరినగర్‌ను మంత్రి ఫరూక్ దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం కాలనీలోని రోడ్లపై వర్షపునీరు చేరడంతో నడవటానికి ఇబ్బందికరంగా ఉందని ఆ నీటిలో కాలనీవాసులతో కలిసి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ 1983లో టీడీపీ ప్రభుత్వం నందమూరినగర్ కాలనీ ఏర్పాటు చేసిందని, అయితే ఇంతవరకు కాలనీ అభివృద్ధిని పట్టించుకోలేదని మండిపడ్డారు. కనీస వసతులు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో 8 రహదారులు సీసీ రోడ్లు లేక చిన్నపాటి వర్షానికే మోకాలిలోతు వర్షపు నీరు నిలిచిపోతుందని చెప్పారు. ఇక విషపురుగులు, దోమలతో ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు.



కాలనీలో నిలిచిన వర్షపునీరు

బెదిరింపులు.. ముగ్గురి అరెస్ట్

డోన్ టౌన్: పట్టణంలో పండ్ల వ్యాపారిని బెదిరించి కాటా తీసుకెళ్లిన ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం సీఐ ఇంతియాజ్ బాషా తన కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. గుత్తికి చెందిన సయ్యద్ నూర్ బాషా డోన్‌లో పండ్ల వ్యాపారం చేస్తుండగా పాతపేటకు చెందిన గొల్ల రఘు అలియాస్ జామకాయల రవి, ఉప్పరి సురేంద్ర, చిగురమానుపేటకు చెందిన అబ్బాస్ బెదిరించారు. బాధితుడు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి ముగ్గురిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

పాత పెన్షన్ వర్తింపజేయాలి

నంద్యాల(అర్బన్): 2003 డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్‌ను వర్తింపజేయాలని యూటీఎఫ్ జిల్లా కన్వీనర్ జాన్సన్, వైఎస్సార్‌టీఎఫ్ నాయకుడు మహేష్ డిమాండ్ చేశారు. 2003 డీఎస్సీ రాష్ట్ర ఫోరం పిలుపు మేరకు యూటీఎఫ్ నాయకులు గురువారం సాయంత్రం నంద్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్ రామసంజీవరావుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తమ సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సంఘం నాయకులు సుకుమార్, ప్రతాప్, రమేష్, రమణ, బాబామస్తాన్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.


డీటీకి వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): స్వామి వివేకానందుడిని యువత ఆదర్శంగా తీసుకోవాలని డాక్టర్ గెలివి సహదేవుడు, రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్వామి వివేకానంద సద్భావ దినోత్సవ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ చికాగో నగరంలో మన దేశ ఆధ్యాత్మిక శక్తిని ప్రపంచానికి పరిచయం చేసిన మహోన్నతుడని కొనియాడారు. ఈనెల 27వ తేదీ వరకు స్వామి వివేకానందుడి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ సుబ్బయ్య, ప్రగతిరెడ్డి, హేమంత్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.


వివేకానందుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

అమర వీరులకు నివాళి

రుద్రవరం: జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని గురువారం స్థానిక అటవీ కార్యాలయంలో నిర్వహించారు. విధినిర్వహణలో ప్రాణాలర్పించిన అటవీశాఖ ఉద్యోగుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో రేంజ్ అధికారి ముర్తుజావలితో పాటు వివిధ సెక్షన్ అధికారులు రామకృష్ణ, మాబుఖాన్, మక్తర్, రాణెమ్మ, ఎఫ్‌బీఓలు జేమ్స్‌పాల్, సురేంద్రగౌడ్, నాగపుశేనయ్య, నరసింహారెడ్డి, మదన్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


అమర వీరులకు నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

ఒకే రోజు ఆరు ఇళ్లలో చోరీ


రవి శంకర్ ఇంట్లో దుండగులు ధ్వంసం చేసిన బీరువాలు, చిందరవందరగా పడేసిన వస్తువులు

బేతంచెర్ల: హెచ్.కొట్టాల గ్రామంలో ఎప్పుడూ లేని విధంగా ఒకే రోజు ఆరు ఇళ్లలో చోరీలు జరిగాయి. దీంతో గ్రామంలో భయాందోళన వాతావరణం నెలకొంది. బుధవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు బోయ పాటి రవిశంకర్, ఉన్నం ధనుంజయ, యండూరి తిరుపాలు, యండూరి మోహన్‌రావు, చికెన్ బాషా, మంజుల అరుణ ఇళ్లలో తాళాలు పగుల గొట్టి బంగారం, వెండి, నగదు, మొబైల్ ఫోన్లు దోచుకెళ్లారు. రవిశంకర్ ఇంటి నుంచి 12 తులాల బంగారం, 10 తులాల వెండి, రూ.20 వేల నగదు అపహరించారు. లారీ డ్రైవర్ ధనుంజయ ఇంట్లో రూ.72 వేల నగదు, యండూరి తిరుపాలు ఇంట్లో మూడు సెల్‌ఫోన్లు, మంజుల అరుణ ఇంట్లో 3 తులాల బంగారం, 16 తులాల వెండి, రూ.1 లక్ష నగదు చోరీ చేశారు. చికెన్ బాషా ఇంట్లో రూ. 500 నగదు చోరీ చేశారు. యండూరి మోహన్‌రావు ఇంటి తాళాలు పగులగొట్టి ఏమీ దొరకకపోవడంతో వెళ్లిపోయారు. ఒక ఇంట్లో మాత్రం మనుషులు ఉండడంతో చోరీ విఫలమైంది. ఆ ఇంట్లోని సీసీ కెమెరాల్లో ముసుగు ధరించిన నలుగురు వ్యక్తులు కనిపించారు. అయితే మొత్తం ఆరు ఇళ్లలో చోరీలు నలుగురే చేశారా లేక మరికొందరా అన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. దొంగతనాలు జరగడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఉల్లిలో నీరు నిల్వ ఉండనీయొద్దు


నాగరాజు, హార్టికల్చర్ జిల్లా అధికారి

నంద్యాల(అర్బన్): ఉల్లి పంటలో వర్షపునీటి నిల్వలు లేకుండా చేస్తే దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నాగరాజు గురువారం తెలిపారు. కురుస్తున్న వర్షాలతో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని సూచించారు. జిల్లాలో 3,500 హెక్టార్లలో ఉల్లి పంట సాగైందని, అందులో డోన్, ప్యాపిలి, బేతంచెర్ల, నందికొట్కూరు, జూపాడుబంగ్లా మండలాల్లో పంట వివిధ దశల్లో ఉందన్నారు. దశల వారిగా జాగ్రత్తలు తీసుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు.

నారు దశ..

- పొలంలో వర్షపు నీటిని బయటకు పంపాలి.
- తుఫాన్ సమయంలో కొట్టుకుపోయిన నారు మళ్లను తిరిగి ఎత్తైన చోట విత్తుకోవాలి.
- నారు మళ్లకు 3గ్రా.కాపర్ ఆక్సీక్లోరైడ్, అలైట్ 1గ్రా. లీటరు నీటికి కలిపి తడిపినట్లయితే నారు కుళ్లు తెగులు ఆశించదు

శాఖీయ దశ..

- పోయిన మొక్కల స్థానంలో తిరిగి మొక్కలను వెంటనే నాటాలి.
- 2 - 3 సార్లు 0.5% పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని వారం వ్యవధిలో పంటపై పిచికారీ చేయాలి.
- సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని 5గ్రా. లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేస్తే మొక్కలు త్వరగా కోలుకుంటాయి.
- ప్రధాన పొలంలో పంట వయస్సు 45 రోజుల్లోపు ఉంటే పైపాటుగా ఎకరాకు 60 కిలోల యూరియా, 20కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి.
- ఆకులు కత్తిరించు పురుగుల నివారణకు 5శాతం వేపగింజల కషాయాన్ని, థయోడికార్బ్ 1గ్రా. లీటరు నీటికి కలిపి స్ప్రే చేయాలి. శనగపచ్చ పురుగు నివారణకు హెచ్ఎన్‌పీవీ- 250ఎల్ఈ/ హెచ్ఏ ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

గడ్డ ఊరే దశ..

- ఈ దశలో ఆకుమచ్చ తెగులు నివారణకు మాంకోజెబ్ 2.5గ్రా. క్లోరోథలోనిల్ 2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కోత దశ..


- తుఫాన్ హెచ్చరిక ఆధారంగా తుఫాన్ రాకముందే వీలైనంత తొందరగా గడ్డలను కోసుకోవాలి.
- సోలార్ డ్రైయర్స్‌ను ఉపయోగించి గడ్డలను ఆరబెట్టుకోవాలి.
- గడ్డలను పీకిన తర్వాత 1గ్రా. థయోఫానేట్ మిథైల్, 1గ్రా. కార్బండిజమ్ లేదా 1 మి.లీ ప్రోపికొనజాల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే నిల్వలో గడ్డ కుళ్లను నివారించవచ్చు.
- వీలైనంత తొందరగా గడ్డలను గ్రేడింగ్, ప్యాకింగ్ చేసి నిల్వ ఉంచకుండా మార్కెటింగ్ చేసుకోవాలి.


ఉల్లిపంటను పరిశీలిస్తున్న హార్టికల్చర్ అధికారి శ్రీధర్

కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శుల నియామకం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా చింతలమోహన్‌రావు యాదవ్, ఎం.సుబ్రహ్మణ్యంను ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి శ్రీకాంత్ నియమించారు. గురువారం నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ నంద్యాల జిల్లా స్థాయి జూనియర్ బాల,బాలికల కబడ్డీ క్రీడాకారుల ఎంపిక ఈనెల 14వ తేదీన స్థానిక ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తామన్నారు. అలాగే 26 జిల్లాల అంతర్‌రాష్ట్ర స్థాయి జూనియర్ బాల,బాలికల కబడ్డీ పోటీలు ఎన్‌టీఆర్ జిల్లా గొల్లపూడిలో ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు జరుగుతాయని చెప్పారు. 51వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో భాగంగా నంద్యాల జిల్లా బాల,బాలికల కబడ్డీ జట్టును ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2006 జనవరి 1 తర్వాత జన్మించి ఉండాలన్నారు. బాలురు 75 కేజీలు, బాలికల 65 కేజీల్లోపు బరువు కలిగిన వారు అర్హులన్నారు. జనన ధ్రువ పత్రం, పదో తరగతి సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో ఉదయం 9గంటలకు ఇండోర్ స్టేడియంలో పాల్గొనాలని సూచించారు. వివరాలకు సెల్ : 9441243601 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

విరిగిపడిన కొండ చరియలు



బేతంచెర్ల: మండల పరిధిలోని మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం కురిసిన భారీ వర్షానికి ఆలయ పక్కన కొండచరియలు విరిగి పడ్డాయి. ఆ సమయానికి భక్తులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. గతంలో ఆలయ నిర్మాణ పనుల కోసం కొండను తొలగించినప్పటికీ, పూర్తి స్థాయిలో తొలగించకపోవడంతో వర్షాకాలంలో అప్పుడప్పుడూ రాళ్లు కూలిపోతున్నాయని అధికారులు తెలిపారు. ఈ అంశాన్ని ఆలయ ఈఓ రామాంజనేయులు దృష్టికి తీసుకెళ్లగా, ఇంకా కొంత కొండ తొలగింపు అవసరం ఉందని.. ఇంజినీరింగ్ సిబ్బంది ఇప్పటికే ప్లాన్, ఎస్టిమేట్‌లు సిద్ధం చేసి సమర్పించారని తెలిపారు. దేవదాయశాఖ కమిషనర్ అనుమతి పొంది తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

నంద్యాల(వ్యవసాయం): కళారాధన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఐఎంఏ, లయన్స్ క్లబ్ సంయుక్త నిర్వహణలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ, సృజనాత్మక సంస్కృతి సమితి సహకారంతో నిర్వహిస్తున్న 'మాతభూమికి కళార్చన' పోటీల్లో భాగంగా గురువారం బాలలకు చిత్రలేఖనం,హిందీ వక్తృత్వం పోటీలు నిర్వహించారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో పలు పాఠశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు చిత్రలేఖనం పోటీలో పాల్గొన్నారు. సామాజిక రుగ్మతలపై చైతన్యం కలిగించే అంశంపై విద్యార్థులు తమ కుంచెలతో వివిధ రంగుల మిశ్రమాలతో స్ఫూర్తిదాయక చిత్రాలు వేశారు. హిందీ వక్తృత్వపు పోటీలో 'దేశ రక్షణలో సైనికుల త్యాగ నిరతి' అంశంపై విద్యార్థులు ప్రతిభ చాటారు. డాక్టర్ రవికృష్ణ, నాగరాజు, జనార్ధన్, ఎస్ఆర్ఎస్ ప్రసాద్, పత్తి రంగనాథ్ పాల్గొన్నారు.


చిత్రాలు వేస్తున్న విద్యార్థులు